
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

సోమవారం 30 సెప్టెంబరు 2024



• ఇంద్రవనం



ఇంద్రకీలాద్రి పచ్చగా కళకళలాడుతోంది. ఈ శరన్నవరాత్రి ఉత్సవాలకు మరింత శోభాయమానంగా ముస్తాబవుతోంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ఆహ్లాదాన్ని పెంచేలా చక్కటి మొక్కలను అలంకరించారు. శివలింగాకృతితో పాటు స్వస్తిక్, ఓంకారం ఆకారంలో ఉన్న మొక్కలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

బుడమేరును మింగేశారు!



బుడమేరును ఆక్రమించి వైసీపీ నేత సాగు చేసిన వెదురు తోట



నందివాడ మండలంలో బుడమేరు గట్టును అక్రమంగా తవ్వేస్తున్న వైసీపీ నాయకులు (ఫైల్)

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో బరితెగింపు

బాపులపాడు మండలంలో 30 ఎకరాల్లో వైసీపీ నేత వెదురు తోట సాగు

- అతని సోదరుడి పేరుతో మరో 2 చేపల చెరువులు
- పుట్టగుంటలో కట్టను తవ్వేసిన మరో నేత
- బాపులపాడు మండలంలో 10 ఎకరాల్లో పామాయిల్ సాగు చేసిన ఓ నాయకుడు

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆక్రమణలు తారస్థాయికి చేరాయి. డొంకలు, పోరంబోకు స్థలాలతో పాటు కోట్లాది రూపాయల విలువ చేసే భూములను సైతం ఆక్రమించారు. బుడమేరు, పాత బుడమేరు పరీవాహక ప్రాంతాల్లో ఏకంగా వెదురు తోట వేశారు. చేపల చెరువులను తవ్వేశారు. ఓ పార్టీ నాయకుడు తాను మాత్రం తక్కువ కాదన్నట్లు పామాయిల్ తోట వేశాడు.. ఓ చేపల మేత ఫ్యాక్టరీ నిర్మించాడు.. చేపల చెరువులను తవ్వి సాగు చేసుకుంటున్నాడు. వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఫలితంగా వర్షాలు, వరదలకు పంట పొలాలు, గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి.

గుడివాడ : బుడమేరు మురుగు నీటిని తరలించే డ్రెయిన్‌గా కాకుండా కొన్ని ప్రాంతాల్లో సాగు నీరుకు ఆధారంగా ఉంది. విజయవాడ పట్టణ ప్రాంతంలో మురుగు నీటి పారుదలకు ఉపయోగపడుతుంది. గన్నవరం పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణలతో కుచించుకుపోయింది. పెదపారుపూడి, నందివాడ, బాపులపాడు, ఏలూరు జిల్లా పెదపాడు మండలాల్లో రాజకీయ నాయకులు బుడమేరు పరీవాహక ప్రాంతాలను అడ్డగోలుగా ఆక్రమించుకుని చేపలు, రొయ్యల చెరువులను తవ్వేశారు. ముఖ్యంగా బాపులపాడు మండలంలోని కురిపిరాల, ఓగిరాల, పెదపాడు మండలంలోని కొణికి, ఒడ్డిగూడెం, నందివాడ మండలంలోని పుట్టగుంట, కుదరవల్లి, అరిపిరాల, లక్ష్మీనరసింహాపురం, ఇలపర్రు ప్రాంతాల్లో బుడమేరులో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి.

వైసీపీ సీనియర్ నేత భూ దోపిడీ

బాపులపాడు మండల పరిధిలో బుడమేరు ఆక్రమణలకు గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి చెందిన సీనియర్ నేత ఒకరు సారథ్యం వహించినట్లు సమాచారం. ఐదేళ్ల అధికారం ముసుగులో సుమారు 50 ఎకరాల్లో బుడమేరును ఆక్రమించుకున్నారు. దాదాపు 30 ఎకరాల్లో వెదురు బొంగుల తోట వేశారు. అతని సోదరుడి పేరుతో రెండు చేపల చెరువులను తవ్వేశారు. బుడమేరు ఆధునికీకరణలో తవ్వకుండా వదిలేసిన ప్రాంతంలో ఆ సీనియర్ నేత ఆక్రమణలకు పాల్పడినట్లు సమాచారం.

మరో పార్టీ నాయకుడి చొరబాటు

బాపులపాడు మండల పరిధిలో బుడమేరు పరివాహక ప్రాంతంలో గట్టు వెంబడి 10 ఎకరాల్లో పామాయిల్ తోటను మరో పార్టీ నాయకుడొకరు సాగు చేస్తున్నారు. చేపల మేత ఫ్యాక్టరీ నిర్మించారు. రెండు చేపల చెరువులను తవ్వేశారు. అదే విధంగా బుడమేరులో 25 మీటర్ల మేర పూడ్చివేసి ఆరు అడుగుల మేర మెరక చేశారు. దీంతో ఆ ప్రాంతంలో బుడమేరు పిల్లకాలువను తలపిస్తోంది. మొన్నటి బుడమేరు వరదల్లో ఈ ప్రాంతంలో కరకట్ట బలహీనంగా మారి గండిపడే ప్రమాదం ఏర్పడింది. ఆ ప్రాంత ప్రజలు, ఆక్వా రైతులు గండిపడకుండా నానాతిప్పలు పడ్డారు.



ఓ పార్టీ నేత ఆక్రమించి సాగు చేసిన పామాయిల్ తోట

బుడమేరు గట్టును తవ్వేసుకున్న వైసీపీ నేత

నందివాడ మండలం పుట్టగుంటకు చెందిన వైసీపీ నేత ఒకరు గత ప్రభుత్వంలో అక్రమంగా చెరువును తవ్వుతూ.. ఆ పక్కనే ఉన్న బుడమేరు గట్టును సైతం తవ్వేసి మట్టిని గుడివాడ తరలించి సొమ్ము చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చెరువు తవ్వకాన్ని నిలుపుదల చేయాలని పలుమార్లు అప్పటి ఆర్‌డీవోకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించారు. భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి.మురళీకృష్ణ కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది.

తప్పులు దొర్లితే అధికారులదే బాధ్యత

13 శాఖల సమన్వయంతో దసరా మహోత్సవాలు

- రూ.500 టికెట్‌కు అంతరాలయ ప్రవేశం లేదు
- వీవీఐపీలకు రెండు స్లాట్‌లలో దర్శనం
- వృద్ధులు, దివ్యాంగులకు సాయంత్రం 4 నుంచి 5 వరకు
- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత
- ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి రామనారాయణ రెడ్డి
- నగరవ్యాప్తంగా విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఏర్పాట్లు



6లో

పొట్టిపాడు నుంచే.. తూర్పు బైపాస్!

తుది డీపీఆర్ రాకతో ఎన్‌హెచ్ నిర్ణయం

- వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక
- ఆమోదం తర్వాత టెండర్ల ప్రక్రియ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ తూర్పు బైపాస్ డీపీఆర్ రావడంతో పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచే విజయవాడ తూర్పు బైపాస్‌కు సంబంధించిన ప్రతిపాదనను కేంద్రానికి పంపించేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు రంగం సిద్ధం చేశారు. మరో వారం రోజుల్లో పంపించనున్నారు. తూర్పు బైపాస్‌కు సంబంధించి అలైన్‌మెంట్ విషయంలో కూడా పూర్తి స్పష్టత వచ్చింది. పొట్టిపాడు టోల్‌ప్లాజా నుంచి కాకుండా చిన్న అవుటపల్లి ప్రస్తుత విజయవాడ వెస్ట్ బైపాస్‌కు అనుసంధానంగా తీసుకువెళ్లాలన్న ప్రతిపాదనలు కూడా ఇటీవల కాలంలో వచ్చాయి. తుది డీపీఆర్‌ను పరిశీలించిన క్రమంలోనే పొట్టిపాడు టోల్‌ప్లాజా నుంచి కాజ వరకు ప్రతిపాదిత మార్గాన్ని కేంద్రానికి నివేదించాలని నిర్ణయించినట్టుగా జాతీయ రహదారుల సంస్థ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని పొట్టిపాడు టోల్‌ప్లాజాను ఎంచుకున్నట్టుగా తెలుస్తోంది. చిన్న అవుటపల్లి నుంచి అయితే ఎయిర్‌పోర్టుకు అత్యంత దగ్గరగా వస్తుంది. రన్‌వేకు దగ్గరగా బైపాస్ వెళ్లడం మంచిది కాదని భావించి.. కాస్త ఎగువకు తీసుకు వెళ్లేందుకు వీలుగా విజయవాడ తూర్పు బైపాస్‌ను చిన్న అవుటపల్లి నుంచి కాకుండా పొట్టిపాడు టోల్‌ప్లాజా నుంచి తీసుకు వెళ్లేందుకు నిశ్చయించింది. ఎన్‌హెచ్ అధికారుల నుంచి కేంద్ర ప్రభుత్వానికి దీనికి సంబంధించిన ప్రతిపాదన వెళ్లిన తర్వాత కేంద్రం ఆమోదించాక టెండర్లకు వెళ్లాల్సిందిగా ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించుకున్నారు.



ఆపత్కాలంలో ఆపన్నహస్తం

నేటితో వరద బాధితులకు సహాయం పూర్తి

- సీఎం చంద్రబాబు నిర్దేశించిన టైమ్‌లోనే..
- నగరం మొత్తం మీద 95 శాతం చెల్లింపులు
- నేటి సాయంత్రానికి మిగిలిన 5 శాతం కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం సోమవారంతో పూర్తికానుంది. అర్హులైన ప్రతి బాధితుడికీ సాయం అందాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం.. ఆదివారం నాటికి 95 శాతం మేర పూర్తిచేశారు. బ్యాంకు ఖాతాల సమస్యల కారణంగా ఇంకా అతిస్వల్ప సంఖ్యలోనే దరఖాస్తులు ఉన్నాయి. ఆన్‌లైన్ గ్రీవెన్స్ ద్వారా కొన్ని, వ్యక్తిగతంగా మరికొన్ని దరఖాస్తులు కలెక్టర్, రెవెన్యూ అధికారులకు అందాయి. వీటిని కూడా రీ వెరిఫికేషన్ చేస్తున్నారు. తాను మళ్లీ విజయవాడ వచ్చినపుడు ఒక్క బాధితుడు కూడా ఎన్యూమరేషన్ పడలేదని ఫిర్యాదు చేయకూడదని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఫిర్యాదును కలెక్టర్ సృజన పరిశీలిస్తున్నారు. దీంతో ఆదివారం నాటికి 95 శాతానికి పైగా వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందింది. మిగిలిన 5 శాతం మాన్యువల్‌గా రీ వెరిఫికేషన్ అయ్యింది. వీరికి సోమవారం సాయంత్రం నాటికి సాయాన్ని అందించనున్నారు.

శరవేగంగా సాయం

ఇంత శరవేగంగా సహాయం అందటంపై బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రకృతి విపత్తులు సంభవించినపుడు ప్రభుత్వం తరపున ఇచ్చే సాయం బాధితులకు అందటానికి చాలాకాలం పట్టేది. ఈసారి రైతులకు పరిహారంతోపాటు వరద బాధితులకు సమాంతరంగా శరవేగంగా ఖాతాల్లో జమ కావటం విశేషం. ఫ్లడ్ ఎన్యూమరేషన్ టీమ్స్ ద్వారా - మిగతా 6లో

సులువుగా అమ్మ దర్శనం



దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై 'సెక్టార్' బందోబస్తు

'దసరా శరన్నవరాత్రుల్లో ఇంద్రకీలాద్రికి వచ్చే సామాన్య భక్తులందరికీ సులువుగా అమ్మ దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈసారి అనధికార దర్శనాలను కట్టడి చేయాలని నిర్ణయించాం. వీఐపీలకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించాం. కోటా ప్రకారమే రోజుకు 2 వేల వరకు వీఐపీ టికెట్లు ఇస్తాం. ఈసారి బందోబస్తులో సెక్టార్ల విధానాన్ని తీసుకొచ్చాం.' అని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. అక్టోబరు 3 నుంచి ఇంద్రకీలాద్రిపై జరిగే శరన్నవరాత్రి మహోత్సవాల బందోబస్తుపై ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు.. - (ఆంధ్రజ్యోతి-విజయవాడ)

36 సెక్టార్లలో పోలీసు, రెవెన్యూ, దేవదాయ సిబ్బంది

- రాజగోపురం నుంచి దర్శనాలకు బ్రేక్
- వీఐపీ దర్శనాలకు ప్రత్యేకంగా యాప్
- రోజుకు 2వేల మంది వీఐపీలకే..
- కోటా పూర్తికాగానే ఆటోమేటిక్ లాక్

ఆంధ్రజ్యోతితో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు

ఆంధ్రజ్యోతి : దసరాలో బందోబస్తు ఎలా ఉంటుంది?

సీపీ : ఇంద్రకీలాద్రిపై జరిగే శర్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి మొత్తం 6 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఈసారి నూతనంగా సెక్టార్ల విధానాన్ని తీసుకొస్తున్నాం. శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాలకు సంబంధించి మొత్తం 36 సెక్టార్లను ఏర్పాటు చేశాం. ఇందులో 25 సెక్టార్లు శాంతిభద్రతలకు, మిగిలిన 11 సెక్టార్లు ట్రాఫిక్ విభాగానికి సంబంధించినవి. ఈ అన్ని సెక్టార్లకు అధికారులతో పాటు సిబ్బంది ఉంటారు. దేవదాయ, పోలీసు, రెవెన్యూ, వీఎంసీల నుంచి అధికారులు, సిబ్బంది ఉంటారు. ఈ సెక్టార్లలో విధులు నిర్వర్తించే సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేస్తారు. ప్రధాన ఆలయం చుట్టూ నాలుగు సెక్టార్లు ఉంటాయి. ఇక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందిని డ్యూటీ సమయం కంటే ముందే ఫాలిన్ కావాల్సి ఉంటుంది. వారిని అక్కడి నుంచి సర్వీసు లిఫ్టులో పైకి పంపుతాం. డ్యూటీ దిగిన వారిని అందులోనే కిందకు తీసుకొస్తాం. ఘాట్‌రోడ్డులో విధులు నిర్వర్తించే సిబ్బంది కోసం ఒక బస్సు ఉంటుంది. కొండపైకి ద్విచక్ర వాహనాలను అనుమతించకూడదన్న ఉద్దేశంతోనే ఈ విధానాన్ని తీసుకొచ్చాం. ఈ సెక్టార్లలో విధులు నిర్వర్తించే వారికి వేర్వేరు రంగులున్న గుర్తింపు కార్డులు ఇస్తాం.

ఆంధ్రజ్యోతి : ఈ సెక్టార్లు ఎక్కడెక్కడ గుర్తించారు?

సీపీ : మహామండపం, అంతరాలయం, రావిచెట్టు, మహామండపం మెట్లు, శివాలయం వైపు, ఆలయ ప్రాకారం చుట్టుపక్కల ప్రదేశాలను సెక్టార్లుగా విభజించాం. ఇవికాకుండా మౌనమహాముని విగ్రహం, ఓం మలుపు ప్రాంతాలను గుర్తించాం.

ఆంధ్రజ్యోతి : సీసీ కెమెరాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

సీపీ : నగరంలో ప్రస్తుతం 1,900 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇంద్రకీలాద్రిపై 200 ఉన్నాయి. ఇవికాకుండా మరికొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇవన్నీ అధికారుల చాంబర్‌లో ఉన్న సర్వర్‌తో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయి. ఇవికాకుండా 20 డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు కమిషనరేట్‌లో ఐదు డ్రోన్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఇతర జిల్లాల నుంచి మరికొన్ని డ్రోన్లను రప్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఏటా వీఐపీ దర్శనాల కారణంగానే భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

సీపీ : వీఐపీల కంటే.. ఆ ముసుగులో జరుగుతున్న అనధికార దర్శనాలే ఎక్కువ. ఈ కారణంగానే సమస్య వస్తోంది. ఈ దర్శనాలన్నీ వీఐపీలకు సంబంధించిన రూ.500 క్యూలో కాకుండా రాజగోపురం పక్కన ఉన్న మెట్లమార్గంలో జరుగుతున్నాయి. ఈ టికెట్ కొనుగోలు చేసిన భక్తులు దానికి సంబంధించిన క్యూలో వెళ్లడం లేదు. రాజగోపురం మార్గం ద్వారా వెళ్తున్నారు. అనధికార వ్యక్తులు దర్శనాలకు వెళ్లడంతో సామాన్య భక్తులు.. విధులు నిర్వర్తించడానికి వెళ్తున్న వారిపైనా ఆరోపణలు చేస్తున్నారు. ఇందుకోసం ఈ ఏడాది వీఐపీల కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే విడుదల చేస్తాం. వీఐపీల కోసం రోజుకు 2వేల టికెట్లను యాప్‌లో అందుబాటులో ఉంచుతాం. ప్రతి ప్రభుత్వశాఖతో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇందులో కొన్ని టికెట్లు కేటాయిస్తారు. కోటా పూర్తికాగానే ఆటోమెటిక్‌గా గేట్‌వే మూసుకుపోతుంది. ఈ యాప్ నిర్వహణకు సంబంధించి ఒక లైజనింగ్ అధికారిని నియమిస్తాం. ఆయన సెల్‌ఫోన్ నెంబరును డిస్‌ప్లే చేస్తాం. ఈ టికెట్లు ఉన్నవారినే రాజగోపురం పక్కన ఉన్న మార్గం నుంచి పంపుతారు. అధికారులు దర్శనాలకు వెళ్లినా ఈ టికెట్ ఉండాల్సిందే. అధికారుల వెంట వెళ్లే సిబ్బందికీ ఈ టికెట్ ఉంటేనే అనుమతిస్తాం.

ఆంధ్రజ్యోతి : వీఐపీల వాహనాలతో ఇబ్బందులు వస్తున్నాయి కదా?

సీపీ : ఈ ఏడాది ఇంద్రకీలాద్రిపైకి వాహనాల సంఖ్య బాగా తగ్గించాలని నిర్ణయించాం. ఆలయంలో విధులు నిర్వర్తించడానికి వచ్చే - మిగతా 6లో

అయ్యో తల్లీ

ఇద్దరు పసికందులతో కాల్వలోకి దూకిన తల్లి

- నాలుగు నెలల చిన్నారి మృతి
- తల్లి, మరో చిన్నారి కోసం గాలింపు



తన నాలుగు నెలల చిన్నారి బ్లెసీతో సుధారాణి (ఫైల్)

విజయవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సజావుగా సాగిపోతున్న కాపురంలో వివాదాలు ముసురుకున్నాయి. పంచాయితీ కోసం బంధువుల ఇంటికి వచ్చిన ఓ మహిళ పిల్లలతో కలిసి కాల్వలోకి దూకిన ఘటన నగరంలో జరిగింది. ఈ ఘటనలో నాలుగు నెలల చిన్నారి మృతిచెందింది. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. గుంటూరులోని శారదా కాలనీలో ఉంటున్న తిరుపతిరావుకు నాలుగేళ్ల క్రితం సుధారాణి(23)తో వివాహం జరిగింది. వారికి జాస్వి, బ్లెసీ అనే ఇద్దరు ఆడపిల్లలున్నారు. జాస్వి వయస్సు 18 నెలలు కాగా, బ్లెసీ వయస్సు నాలుగు నెలలు. తిరుపతిరావు, సుధారాణి దంపతుల మధ్య కొంతకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. తిరుపతిరావు మట్టి పనులు చేస్తుంటాడు. శనివారం రాత్రి దంపతులిద్దరి మధ్య వివాదం జరిగింది. ఈ విషయం కృష్ణలంక వద్ద కళానగర్‌లో ఉంటున్న తిరుపతిరావు అన్నయ్య కోటేశ్వరరావుకు తెలిసింది. భార్యభర్తల మధ్య ఉన్న వివాదాన్ని సర్ది చెప్పడానికి వారిని విజయవాడకు పిలిపించారు. ఆదివారం ఉదయం కోటేశ్వరరావు ఊరు వెళ్లాడు. తర్వాత కాసేపటికి తిరుపతిరావు బయటకు వెళ్లాడు. ఆ తర్వాత సుధారాణి తన ఇద్దరి పిల్లలతో కలిసి బెంజిసర్కిల్ వద్ద ఉన్న స్క్రూబ్రిడ్జి దగ్గరకు చేరుకుంది. అక్కడి నుంచి బందరు కాల్వలోకి దూకేసింది. ఇది గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేశారు. పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, పడవల రేవు వంతెన వద్ద చిన్న కుమార్తె బ్లెసీ మృతదేహం కనిపించగా, సుధారాణి, జాస్వి ఆచూకీ లభించలేదు. వారికోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. కేసును పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ కో-ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, బీఎస్పీ, బీసీ సంఘాల నాయకులు

బీసీ హక్కులు కులగణనతోనే సాధ్యం

వన్‌టౌన్, సెప్టెంబరు 29 : కులగణనతోనే బీసీ హక్కులు, రాజకీయ మనుగడ సాధ్యమని, రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం విజయవాడలో పార్టీ రాష్ట్ర స్థాయి, బీసీ సంఘాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కాన్షీరాం వర్ధంతి రోజైన అక్టోబరు 9న కులగణన డిమాండ్‌తో విజయవాడలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కులగణన చేస్తేనే బీసీ కులాలకు మనుగడ, రాజకీయ ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని, మహాధర్నాతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి కులగణన చేసేలా డిమాండ్‌ను సాధించుకోవాలన్నారు. రాష్ట్రంలో రెండు కులాల పార్టీల ఆధిపత్యం మధ్య బీసీల రాజకీయ హక్కులు హరించిపోతున్నాయన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డి.పరంజ్యోతి మాట్లాడుతూ, కులగణన ధర్నాను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మహాధర్నా పోస్టర్లను, కులాంధ్రప్రదేశ్ పుస్తకాలను ఆవిష్కరించారు.



దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిని అభినందిస్తున్న సభ్యులు

దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉట్టి నాగశయనం

వన్‌టౌన్ : దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉట్టి నాగశయనం ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన పొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా, రాష్ట్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆదివారం గుణదలలోని సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో ఉట్టి నాగశయనాన్ని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు కర్ల నాగరాజు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నాగశయనాన్ని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సమావేశంలో దేవాంగ కుల అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, మహిళా విభాగ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సజ్జా హేమలత, ఉప్పుగంటి రాజశ్రీ, కాలేపు సత్యనారాయణ, గుత్తి త్యాగరాజు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణలో నిర్వాహకులు

జాతీయ కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

విజయవాడ స్పోర్ట్సు : విశాఖ స్టేడియంలో డిసెంబరు 15నుంచి రెండో జాతీయ స్థాయి కరాటే పోటీలు (మేకల విజయ సారధి మెమోరియల్)ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు సీహెచ్ సతీష్‌కుమార్, కాయ్(ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్) అధ్యక్షుడు కోలా ప్రతాప్‌లు తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రిన్సిపాల్ మేకల లక్ష్మీప్రసాద్‌చే బ్రోచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోటీలు జరిగే రోజునే స్వర్గీయ విజయసారధి క్రీడల కోసం రాసిన పుస్తకం 20 సంవత్సరాల తర్వాత తిరిగి విడుదలు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో కాయ్ కార్యదర్శి జి.ఆనందబాలు, బాలా, అన్నజగన్, ధర్మతేజ, రాము, శ్రీను, వాసులు పాల్గొన్నారు.

3 నుంచి జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు : విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీల్లో అక్టోబర్ 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు ఆల్ ఇండియా ర్యాంకింగ్ సబ్ జూనియర్స్ అండర్-15, 19 బ్యాడ్మింటన్(కలగర నాగబాబు మెమోరియల్) టోర్నీని నిర్వహించనున్నట్టు ఏపీబీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ద్వారకానాథ్, పి.అంకమ్మ చౌదరీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుసగా రెండో ఏడాది టోర్నీని ఏపీకే ది బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) కేటాయించిందన్నారు. రెండు వేదికలపై 12 కోటర్లులో 1500 మంది ప్లేయర్స్ తలపడతారని, 3 నుంచి 7వ తేదీ వరకు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయని, 7 నుంచి మెయిన్ డ్రా మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. అండర్-15, 17 బాలబాలికల సింగిల్స్ డబుల్స్ మిక్స్‌డ్ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయన్నారు. మెయిన్ డ్రా పోటీలు ప్రారంభోత్సవం, విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నామని ద్వారకానాథ్ తెలిపారు.



ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జనసేన వీరమహిళలు

ప్రాయశ్చిత్త దీక్షకు వీరమహిళల సంఘీభావం

విజయవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేయడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు జనసేన వీరమహిళలు సంఘీభావం తెలిపారు. వీరమహిళ విభాగం కృష్ణా, పెన్నా ప్రాంతీయ సమన్వయకర్త రావి సౌజన్య ఆధ్వర్యంలో వీరమహిళలు పటమటలంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విష్ణుసహస్రనామం, హనుమాన్‌చాలీసా పఠనం, గోవిందనామాల స్మరణ చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు దుర్గారాణి, ఇనగంటి ప్రదీప్, శ్రీకాంత్, సాయిపవన్, ప్రియ, సాయికుమారి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొలికపూడిపై నెట్టెం రఘురాంకు ఫిర్యాదు చేస్తున్న ఏపీఎంపీఏ నేతలు

అధిష్ఠానం దృష్టికి కొలికపూడి వ్యవహారం!

జగ్గయ్యపేట, సెప్టెంబరు 29 : తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం దృష్టిలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఉందని, త్వరలోనే సీఎం చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకుంటారని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఏపీఎంపీఏ ప్రతినిధుల బృందానికి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే వ్యవహారంపై అసోసియేషన్ నేతలు వీర్లశ్రీరాం యాదవ్, శాఖమూరి మల్లికార్జునరావు, విజయబాబు, కె.సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పలువురు నెట్టెంను కలిసి తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి భాషా శైలిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో పార్టీ అన్ని కోణాల్లో విచారించిందని, సీఎం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

తప్పులు దొర్లితే అధికారులదే బాధ్యత

- 13 శాఖల సమన్వయంతో దసరా మహోత్సవాలు
- రూ.500 టికెట్‌కు అంతరాలయ ప్రవేశం లేదు
- వీవీఐపీలకు రెండు స్లాట్‌లలో దర్శనం
- వృద్ధులు, దివ్యాంగులకు సాయంత్రం 4 నుంచి 5 వరకు
- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత
- నగర వ్యాప్తంగా విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఏర్పాట్లు
- ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



దసరా ఏర్పాట్లలో మంత్రి రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే సుజనా, కలెక్టర్, పోలీసు అధికారులు

వన్‌టౌన్, సెప్టెంబరు 29 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు జరగనున్న దసరా మహోత్సవాలలో ఏచిన్న పొరపాటు జరిగినా సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబులతో పాటు వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రూ.500 టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులకు అంతరాలయ దర్శనం ఉండదని, ముఖమండపం ద్వారానే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సామాన్య భక్తులకు అవరోధం లేకుండా వీఐపీలకు ప్రత్యేక స్లాట్‌లు కేటాయించామని, ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు స్లాట్‌లలో వీఐపీలు రావాల్సిందిగా కోరుతున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శనం కల్పిస్తామని, ముందుగా రిజిస్టర్ చేసుకున్నా, నేరుగా వచ్చినా దర్శనం కల్పిస్తామన్నారు.

- అన్నప్రసాదాలు, ప్రసాదాల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదని, క్వాలిటీ టెస్టింగ్ చేసిన తరువాతనే పంపిణీ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ లేదని, ఏ చిన్న పొరపాటు జరిగినా అధికారులనే బాధ్యులుగా చేస్తామని స్పష్టం చేశారు. దసరా మహోత్సవాల సందర్భంగా నగరాన్ని శోభయమానంగా ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.
- ఎమ్మెల్యే సుజనా చౌదరి, కలెక్టర్, పోలీసు, మున్సిపల్ కమిషనర్లు, ఆలయ ఈవో, తదితరులు ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు సమావేశాలు నిర్వహించి, ఉత్సవాల నిర్వహణపై నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 13 శాఖల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు.
- అక్టోబరు 9వ తేదీ మూలా నక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబు సతీ సమేతంగా విచ్చేస్తారని చెప్పారు. దేవదాయశాఖ తరపున చంద్రబాబుకు సోమవారం దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఇవ్వనున్నట్టు తెలిపారు.
- దుర్గగుడి ఆలయ పరిసరాలలో మొత్తం 120 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూం ద్వారా వాటిని నిరంతరం పరిశీలిస్తూ తగు సూచనలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుంచి కొండపైకి రావటానికి క్యూ ఉందని, ఈ క్యూలో వచ్చే భక్తులకు మంచినీరు అందించేందుకు పాకెట్లు, వాటర్ బాటిళ్లను సిద్ధం చేస్తున్నామని, సుమారు 35 లక్షల పాకెట్లు, వాటర్ బాటిళ్లను సేకరించి భక్తులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.
- పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, మునుపెన్నడూ లేనివిధంగా ఈ దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈసారి దసరా మహోత్సవాలను వినూత్నంగా నిర్వహించాలన్నదే తమ అభిప్రాయమని, సామాన్య భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు.
- రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ తదితరాలు మొత్తం 6 పాయింట్ల వద్ద షామియానాలు వేసి భక్తులు వేచిఉండేందుకు సిద్ధం చేస్తున్నామని, కాఫీ, మంచినీరు, టీ తదితరాలు అందించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు.

విధుల్లోకి దుర్గగుడి ఉద్యోగులు

వన్‌టౌన్, సెప్టెంబరు 29: ద్వారకా తిరుమల, అన్నవరం, పెనుగంచిప్రోలు నుంచి బదిలీపై దుర్గగుడికి వచ్చిన ఉద్యోగులు ఆదివారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా దుర్గగుడి నుంచి మొత్తం 18 మంది ఉద్యోగులు ద్వారకా తిరుమల, అన్నవరం, పెనుగంచిప్రోలు దేవస్థానాలకు బదిలీపై వెళ్లారు. ఆయా దేవాలయాల నుంచి దుర్గగుడికి బదిలీపై వచ్చిన ఉద్యోగులు ఆదివారం విధుల్లో చేరారు. ద్వారకా తిరుమల నుంచి ఏఈవో ఎం.దుర్గారావు, సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకున్నారు. అన్నవరం దేవస్థానం నుంచి ఏఈ పి.రాజబాబు, సీనియర్ అసిస్టెంట్లు బి.త్రినాథ్, జి.ఎల్.వి.ఆర్.చౌదరి, జూనియర్ అసిస్టెంట్లు సీహెచ్ రమేష్ బాబు, జి.ప్రసాద్, కె.నరసింహారావులు విధుల్లో చేరారు. పెనుగంచిప్రోలు నుంచి బదిలీపై వచ్చిన ఈఈ టి.వైకుంఠరావు శనివారం విధుల్లో చేరారు. ఇంకా తొమ్మిది మంది ఉద్యోగులు ఆయా దేవాలయాల నుంచి దుర్గగుడికి రావాల్సి ఉంది.

సమన్వయంతో విజయవంతం చేద్దాం



విజయవాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖలతోపాటు మీడియా సమన్వయంతో శరన్నవరాత్రులను విజయవంతం చేయాలని కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు ఆకాంక్షించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో మీడియా సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శరన్నవరాత్రులకు దేశం నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తుల కోసం 27 ప్రాంతాల్లో తాగునీరు అందుబాటులో ఉంచుతామన్నారు. క్యూలైన్లలో ఇబ్బందులు పడుతున్న భక్తులకు బయటకు వచ్చేందుకు వీలుగా మధ్యమధ్యలో ఎగ్జిట్ పాయింట్లు పెడుతున్నామన్నారు. సామాన్లను భద్రపరచడానికి 30 క్లాక్‌రూంలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీసీపీలు గౌతమి షాలి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీలు పాల్గొన్నారు.

ముంపు బాధితులందరికీ పరిహారం

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



వన్‌టౌన్, సెప్టెంబరు 29 : వరద ముంపు ప్రభావిత కుటుంబాలు అందరికీ ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందుతుందని, ఇప్పటికే లబ్ధిదారులకు పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన కొద్దిశాతం మందికి కొన్ని కారణాల వల్ల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. వరద ప్రభావంతో ముంపునకు గురైన ఇళ్లకు సంబంధించి 75,427 కుటుంబాల ఖాతాల్లో సుమారు రూ.160.47 కోట్ల మేర నగదు జమచేయటం జరిగిందన్నారు. 4,315 కుటుంబాలకు సంబంధించి బ్యాంకు ఖాతాల సమస్యలు ఉత్పన్నం అయ్యాయని, మరో ఎనిమిది వేల కుటుంబాలకు సోమవారం నగదు బదిలీ (డిబిటీ) ద్వారా ఖాతాల్లో నగదు జమ కానున్నదని తెలిపారు. బ్యాంకు ఖాతాల సమస్యలున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాంకు ఖాతాల సమస్యలు ఉన్నవారు తమ బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలని, సత్వరం బ్యాంకును సంప్రదించి ఆధార్‌తో ఖాతాను లింక్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు సహాయం అందిస్తారని వెల్లడించారు. బ్యాంకు ఖాతా వివరాలు సరైన విధంగా నమోదు చేసుకుంటే సోమవారం సాయంత్రంలోపు జమ చేయటం జరుగుతుందని తెలిపారు. ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఒక్క బాధిత కుటుంబానికి పరిహారం అందకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో తగిన చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్జీని పరిశీలించి పరిహారం అందించటం జరుగుతుందని ఆమె ప్రకటనలో తెలిపారు.

సోషల్ మీడియాలో వార్తలు అవాస్తవం!

వరద బాధితుల ఆర్థిక సహాయానికి సంబంధించి ఖాతాలలో నగదు జమ కానివారికి నేరుగా సాయం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని కలెక్టర్ సృజన తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా అపోహలు సృష్టించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సోమవారం కలెక్టరేట్‌లోని పింగళివెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వినతులను స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు సంబంధిత కలెక్టరేట్ డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల అధికారులు ప్రజల అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

ఘనంగా కృష్ణాజిల్లా రచయితల సంఘం మహాసభలు



సిద్ధేంద్ర యోగి కళాపీఠం కళాకారుల కూచిపూడి నృత్య అభినయం

అవనిగడ్డ, సెప్టెంబరు 29 : కృష్ణా జిల్లా రచయితల సంఘం 16వ మహాసభలు అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఘనంగా జరిగాయి. హైకోర్టు మాజీ న్యాయమూర్తి అంబటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి జీవీ పూర్ణచంద్ తదితరులు పర్యావరణ పరిరక్షణలో రచయితల పాత్రపై మహాసభలో చర్చ జరిపారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ రచించిన 'కృష్ణం వందే జీవనాధారం' పుస్తకాన్ని, హైదరాబాద్‌కి చెందిన కవి శిఖామణి నిర్వహించే కవి సంధ్య మాసపత్రిక 50వ సంచికను మహాసభల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూచిపూడి శ్రీ సిద్ధేంద్రయోగి కళాపీఠం విద్యార్థులు తరంగ నృత్య ప్రదర్శనను, రావణ శివాష్టకం, కలిదే నృసింహుడు, అన్నమయ్య పద నృత్యాలు ఆహుతులను విశేషంగా అలరించాయి.

పర్యావరణ పరిరక్షణలో రచయితల పాత్ర

కీలకం : అంబటి శంకర్ నారాయణ

ప్రకృతి వైపరీత్యాల నివారణ, పర్యావరణ పరిరక్షణలో రచయితల పాత్ర అత్యంత కీలకమైనదని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అంబటి శంకర్ నారాయణ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల బాధ్యతను వివరించటంలో రచయితల పాత్ర కీలకమైనదన్నారు. దివంగత మండలి వెంకట కృష్ణారావు కృషితో నేటికీ కృష్ణా రచయితల సంఘం సమాజ శ్రేయస్సు కోసం విశేషమైన కృషి చేస్తున్నదని శంకర్ నారాయణ అభినందించారు. కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వంగల నారాయణరావు మాట్లాడుతూ, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా తెలుగుభాషకు మండలి కుటుంబం బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిందన్నారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు భాషా పునర్జీవానికి ఈ సంఘాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, 1982లో దివిసీమ సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీక్షేత్రంలో కృష్ణా జిల్లా తెలుగు రచయితల మహాసభలు నిర్వహించామని, ఈ సంస్థ ప్రపంచ దేశాల్లో గుర్తింపు, ఖ్యాతిని పొందేలా అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. రచయితలు మంచి రచనలు చేసి ప్రజల్లో మార్పు తీసుకురావాలని సూచించారు. రచయితల మహాసభలను పురస్కరించుకుని ఆచార్య అప్పాజోశ్యుల సత్యనారాయణ, మండల మాధవరావు, రావులపాటి సీతారామ్, మారుతీ పురోహితులు తదితరులకు పురస్కారాలు ప్రదానం చేశారు.

ఆపత్కాలంలో ఆపన్నహస్తం

(5వ పేజీ తరువాయి)

జరిగిన సమగ్ర సర్వే కూడా ఇందుకు ఎంతో ఉపయోగపడింది. దీని వల్ల వేగంగా అంచనా వేయడం సాధ్యమైంది. నగరంలో 1,500 వరద ఎన్యూమరేషన్ బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశాయి. మొత్తం 3.20 లక్షల మంది వరద బాధితులు తేలగా, 78 వేల నివాసాల్లో 64,799 ఇళ్లు పూర్తిగా మునిగాయి. వీటన్నింటికీ మొత్తంగా రూ.185 కోట్ల వరకు సాయాన్ని అందించారు. దెబ్బతిన్న ద్విచక్రవాహనాలు, ఆటోలు, తోపుడు బండ్లు, దెబ్బతిన్న కిరాణా షాపులు, హోటళ్లు, చిన్నతరహా పరిశ్రమలు, పంట నష్టాలకు కూడా సాయమందింది. ఎన్యూమరేషన్ కాని మరో 18 వేల మంది బాధితులను కూడా గుర్తించారు. అందులో 5 వేలు నకిలీ కాగా, మిగిలిన 13 వేల కేసులపై జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టింది. వీటిలో 3 వేల దరఖాస్తులు మాత్రమే మిగిలాయి. చాలావరకు ఆధార్‌తో బ్యాంకు ఖాతాల అనుసంధానం జరగకపోవటం, బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవటం వల్లే నగదు జమ కాలేదు. వంద దరఖాస్తులకు ఇతర సమస్యలు ఉన్నాయి. సోమవారం నాటికి అన్నీ పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాత కూడా ఏమైనా సమస్యలు వస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశముంది.

ఎక్స్ఛేంజ్ టూర్లకు ఏసీఏ క్రికెటర్లను పంపండి

- బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు వెంగ్‌సర్కార్‌కు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని సూచన



వన్‌టౌన్, సెప్టెంబరు 29 : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నుంచి నైపుణ్యం ఉన్న ముగ్గురు ఉత్తమ క్రికెటర్లను అంతర్జాతీయ అనుభవం పొందేందుకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా దేశాలకు ఎక్స్ఛేంజ్ టూర్లకు పంపించాలని భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు దిలీప్ వెంగసర్కార్‌కు ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. ఆదివారం బెంగుళూరులో జరిగిన జాతీయ క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, బీసీసీఐ కార్యదర్శి జైషా, దిలీప్ వెంగసర్కార్‌ను కలిశారు. ఏసీఏ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఎంపీ శివనాథ్ వారితో చర్చించారు. ఎక్స్ఛేంజ్ టూర్లకు ఏసీఏ క్రికెటర్లను పంపించాలన్న కేశినేని చిన్ని సూచనకు దిలీప్ వెంగసర్కార్ సానుకూలంగా స్పందించారన్నారు. దీనిపై ఆంధ్ర క్రికెటర్లు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్ బాబు పాల్గొన్నారు.



దుర్గమ్మ దర్శనానికి భక్తుల రద్దీ

వన్‌టౌన్, సెప్టెంబరు 29 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైకి చేరుకున్నారు. దుర్గమ్మ కరుణ కోరుతూ ఆర్తితో అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

సూర్యోపాసన సేవ...

ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు..

కానూరుకు చెందిన డి.కాంతి లక్ష్మి అన్న వితరణ కార్యక్రమానికి రూ.1,01,116లు విరాళాన్ని చెక్కు రూపంలో ఈ.ఓ రామారావును కలిసి ఆదివారం అందజేశారు.

స్వర్ణతాపడం పనులకు..

దుగ్గిరాల బ్రాహ్మణ వీధికి చెందిన కె.శివనాగేశ్వరరావు ఆలయ గోపుర స్వర్ణతాపడం పనుల నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు.

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం ఉచిత దర్శనం క్యూలో నడుచుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలో భక్తులకు ఏవిధంగా దర్శనం అందుతుందన్న దానిపై ఆయన స్వయంగా పరిశీలించారు.

కళావేదిక పై కూచిపూడి నృత్యం

కళావేదికపై శ్రీకృష్ణవేణి కళా నిలయం సముద్రాల కాంచన ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన హృద్యంగా సాగిం ది. కళాకారులు చక్కటి హావ, భావాలు ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళధ్వనులు అందుకున్నారు.

న్యూస్ బాక్స్

ఓటరుగా నమోదు చేసుకోండి

వన్‌టౌన్ : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల్లో పట్టభద్రులైన వారందరూ ఈనెల 30 నవంబరు 6వ తేదీలోగా ఓటరుగా నమోదు కావాలని గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా నమోదు కావాలన్నారు.

క్రీడాకారుల ప్రోత్సాహకాలను విడుదల చేయండి

విజయవాడ స్పోర్ట్సు : అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో పతకాలను సాధించిన క్రీడాకారులకు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.11 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేయడానికి సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని కేపీ రావు కార్పొరేటర్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కేపీ రావు సీఎం చంద్రబాబుకు ఆదివారం రాసిన లేఖలో కోరారు. వివిధ టోర్నీలకు వెళ్లే క్రీడాకారులకు టీ షర్టులు, టీఏ, డీఏలను శాప్ ద్వారా ఖర్చుచేసేలా తగు చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

సులువుగా అమ్మ దర్శనం

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది వాహనాలను పరిమిత సంఖ్యలో అనుమతిస్తాం. దర్శనానికి వచ్చే వీఐపీల కోసం పున్నమిఘాట్ వద్ద ఏర్పాట్లు చేశాం. వీఐపీలు ఎవరైనా నేరుగా పున్నమిఘాట్‌కు చేరుకోవాలి. అక్కడ వారి కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తాం. వాటిలో కొండపైకి రావాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : కనకదుర్గానగర్‌లో సమస్యలపై ఏమంటారు?

సీపీ : కనకదుర్గానగర్‌లో ఈ ఏడాది కొంచెం ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ప్రతి ఏడాది అమ్మవారిని దర్శించుకున్న భక్తులు శివాలయం వైపున ఉన్న మెట్లమార్గం నుంచి కిందకు దిగేవారు. ఈసారి అక్కడ అన్నదానం కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. మహామండపానికి పక్కన పోటు భవనం నిర్మిస్తున్నారు. కనకదుర్గానగర్‌లో ఈ ఏడాది నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శివాలయంవైపు ఉన్న మెట్లు కొంతవరకు తొలగించారు. దర్శనం చేసుకున్న భక్తులు కిందకు వచ్చేందుకు దీనికి పక్క నుంచి 12 అడుగుల వెడల్పుతో తాత్కాలికంగా మెట్లు ఏర్పాటు చేశాం. దర్శనమయ్యాక భక్తులు బయటకొచ్చే మార్గాలను ఈసారి పెంచాం. దర్శనం చేసుకున్న భక్తులు మహామండపం మెట్ల నుంచి కిందకు వెళ్లొచ్చు.

ఆంధ్రజ్యోతి : మూలానక్షత్రం రోజు ప్రణాళికలేంటి?

సీపీ : గత ఏడాది మూలానక్షత్రం రోజున అమ్మవారి దర్శనానికి 1.75 లక్షల మంది వచ్చారని అంచనా. ఈ ఏడాది ఆ సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నాం. అందుకోసం ఈసారి హోల్డింగ్ పాయింట్లను పెంచుతున్నాం. ఈ పాయింట్లను పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ మీదకు పెంచుతాం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

3 నుంచి పోలేరమ్మ గుడిలో శరన్నవరాత్రులు

భవానీపురం, సెప్టెంబరు 29: ఊర్మిళానగర్ గ్రామదేవత పోలేరమ్మ గుడిలో అక్టోబరు 3 నుంచి 12 వరకు 38వ దసరా శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయకమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి, కార్యదర్శి గుత్తావళి విజయ్‌బాబు, అర్చకులు గంటి సన్యాసరావు తెలిపారు. గుడి ప్రాంగణంలో బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. అమ్మవారు రోజుకొక అవతారంలో దర్శనమిస్తారని, రోజూ కుంకుమపూజలు నిర్వహిస్తామని, 12న శమీపూజ, అఖండ హారతులు సాయంత్రం ఇస్తామని రామిరెడ్డి వివరించారు. 13న పోలేరమ్మ ఊరేగింపు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల అభివృద్ధికి రూ.200 కోట్లు

- నగరానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించారు
- వరదలొచ్చినా ఇబ్బంది రాకుండా బాగుచేయించాలని ఆదేశించారు: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, సెప్టెంబరు 29: వరదలొచ్చినా ఇబ్బంది లేకుండా నగరంలో డ్రెయిన్లు బాగుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారని, అందుకు రూ.200 కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని పరిటాల ఓంకార కల్యాణ మండపంలోని అన్ని కాలనీల పెద్దలు కలిసి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వరదల్లో విధులకు హాజరవుతూ ప్రమాదానికి గురైన 12 మంది పారిశుధ్య కార్మికులకు 4వ డివిజన్‌లోని అన్ని కాలనీల అసోసియేషన్ల నుంచి సేకరించిన రూ.2,15,000ను ఎమ్మెల్యే గది రామ్మోహన్ అందజేశారు. తూర్పు నియోజకవర్గంలో గుంట తిప్ప డ్రెయిన్ మరమ్మతులకు రూ.17 కోట్లు కేటాయించామన్నారు. టీడీపీ యువనేత గద్దె క్రాంతికుమార్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, డివిజన్ నేతలు గొల్లపూడి నాగేశ్వరరావు, ఎం.పి దాస్, పాతూరి సాంబశివరావు,వై. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చెక్ అందజేస్తున్న డాక్టర్ ఉలవపల్లి గంగాధర్‌రెడ్డి

సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం

లబ్బీపేట, సెప్టెంబరు 29: వరద బాధితుల సహాయర్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆపన్న హస్తం చైర్మన్ డాక్టర్ ఉలవపల్లి గంగాధర్‌రెడ్డి సీఎం చంద్రబాబునాయుడుకు రూ.లక్ష చెక్‌ను ఆదివారం అందజేశారు. మురళీకృష్ణ, దుర్గచౌదరి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

భారతీనగర్, సెప్టెంబరు 29: కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ, నిరంతరం టీడీపీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని యువనేత గద్దె క్రాంతికుమార్ అన్నారు. నాలుగో డివిజన్ హైటెన్షన్‌వైర్ల రోడ్డులోని వెస్టన్ కళాశాల సమీపంలో జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్న పార్టీ కార్యకర్త లింగాల వెంకటేశ్వరరావు షాపు రేకులు పగులగొట్టి అందులోని కంప్యూటర్, కొంత నగదును దుండగులు దొంగిలించారని కార్పొరేటర్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తక్షణమే స్పందించారు. లింగాల వెంకటేశ్వరరావు జీవనోపాధి నిమిత్తం ఆదివారం తన తనయుడు గద్దె క్రాంతి కుమార్‌ను పంపి రూ.25వేలు అందజేయించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ, కొర్రపాటి సురేంద్ర, యలమంచలి రాజేష్, చలసాని వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిట్టినగర్: జన్మభూమి రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించినట్లు ఆదివారం కొత్తపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అంబాపురం పంచాయతీ పరిధిలోని జన్మభూమి రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న హైవే అండర్ పాస్‌పైన గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొందని సమాచారం అందుకున్న వీఆర్వో బి. అరుణాదేవి వెళ్లి చూడగా, అతను అప్పటికే చనిపోయి ఉన్నాడు. ఘటనపై వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు నూకరాజు

- సంస్మరణ సభలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, సెప్టెంబరు 29: క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ కలిగిన కమ్యూనిస్టు నాయకుడు నూకరాజు అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఇటీవల మరణించిన కమ్యూనిస్టు నాయకుడు, సీపీఐ నగర కౌన్సిల్ సభ్యుడు నూకరాజు సంస్మరణ సభ ఆదివారం విశాలాంధ్ర ప్రాంగణంలో నిర్వహించారు. కొండ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి, బాలభాస్కర్ నగర్ కొండ మీద మంచినీటి ట్యాంకు నిర్మాణానికి అన్ని విధాల సహకరించిన వ్యక్తి నూకరాజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, 6వ డివిజన్ కార్యదర్శి పడాల కనకారావు, నార్ల వెంకటేశ్వరరావు, లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, తాడి పైడయ్య, మూలి సాంబశివరావు పాల్గొన్నారు.

వరద బాధితులందరికీ నష్టపరిహారం అందిస్తాం

- ఆందోళన వద్దు: ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, సెప్టెంబరు 29: వరద బాధితులందరికీ నష్టపరిహారం తప్పకుండా అందజేస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందొద్దని ఆయన సూచించారు. న్యూ నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కండ్రిక, పైపుల రోడ్డు ప్రాంతాల్లో వరదల్లో మరమ్మతులకు గురైన ద్విచక్రవాహనాలకు ఉచితంగా రిపేర్లు చేశారు. అక్కడికి విచ్చేసిన బొండా ఉమా అసోసియేషన్ సభ్యులను అభినందించారు. వరద బాధితులకు ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, అసోసియేషన్ సభ్యులు కడలి ప్రసాద్, శ్రీనుబాబు, రంగబాబు పాల్గొన్నారు.



అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

వరద నష్టం అపారం.. సహాయం పరిమితం

- దసరాకు ముందే బాధితులందరికీ సాయమందించాలి: సీహెచ్ బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 29: బుడమేరు వరదల వలన జరిగిన నష్టం అపారమని, రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయం పరిమితంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్, న్యూ రాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి వరద బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్‌లో బాధితుల సంఖ్యను కుదించడం తగదని గుర్తింపులో లోపభూయిష్టమైన నిబంధనలు మార్చాలని కోరారు. దసరా పండుగకు ముందే బాధితులందరికీ ప్రభుత్వం సాయం అందించాలని ఆయన కోరారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్ కేంద్రంగా ప్రజల ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 29: సీతారామపురం గీతామందిర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట రైవస్ కాలువగట్టు, సీతారామపురం కాలువగట్టు, లాల్‌బహదూర్ శాస్త్రివీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీసురోడ్డు, గీతామందిర్ రోడ్డు, మేదర బజార్, కోటిలింగాల వారి వీధి, నెహ్రూ వీధి, చాపరాలవారివీధి, ఐనవోలు వారివీధి, రామా కార్పొరేషన్ వీధి, శాతవాహనకాలేజీ రోడ్డు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 29: బందరు లాకుల సెంటర్‌లోని సీనియర్ సిటిజెన్స్ హాలులో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంకే బేగ్ స్కూల్, కేర్ అండ్ షేర్ స్కూల్, సుబ్బారెడ్డి మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, అధ్యక్షుడు దావులూరి సాంబశివరావు, కార్యదర్శి పి.రాము పాల్గొన్నారు.

ఎక్స్ సర్వీస్‌మెన్ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవం

ఆటోనగర్, సెప్టెంబరు 29: ఆల్ ఇండియా సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి టి.రాజేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీతారామపురం ఐసీఐసీఐ బ్యాంకు ఆవరణలో సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్‌గా పీసీ స్వామి, గౌరవ అధ్యక్షుడుగా టి.రాజేష్‌కుమార్, అధ్యక్షుడిగా హరినాథ్, ఉపాధ్యక్షుడిగా ఏడుకొండలు, కార్యదర్శిగా జీఎస్‌బీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా ప్రభాకర్‌రావు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని తెలిపారు.

గుర్రం జాషువాకు నివాళి

గవర్నర్‌పేట, సెప్టెంబరు 29: సమాజంలో పరిస్థితులు మారాలని గుర్రం జాషువా అనేక రచనలు చేశారని ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి తెలిపారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ శాఖా గ్రంథాలయంలో గుర్రం జాషువా 129వ జయంతిని నిర్వహించారు. జాషువా చిత్రపటానికి రమాదేవి నివాళులర్పించారు.



పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, పాదరక్షల కిట్లను అందజేస్తున్న అడ్డూరి శ్రీరామ్, నాగుల్ మీరా తదితరులు



వరద బాధితులకు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేస్తున్న సాధినేని యామినీశర్మ

వరద బాధితులకు ఆపన్నహస్తం

వన్‌టౌన్, సెప్టెంబరు 29: వరద విపత్తు సమయంలో పారిశుధ్య కార్మికులు వెలకట్టలేని సేవలు అందించారని కూటమి నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆదేశాల మేరకు సుజనా ఫౌండేషన్, జిప్పర్స్ కంపెనీల సహకారంతో పశ్చిమ నియోజకవర్గంలోని 995 మంది పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, చెప్పుల కిట్లను వారు పంపిణీ చేశారు. భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగుల్‌మీరా, అడ్డూరి శ్రీరామ్, జిప్పర్స్ కంపెనీ అధినేతలు గణేష్, శ్రీను బాబు, పైలా సోమినాయుడు, గుడివాడ నరేంద్ర రాఘవ, బుల్లా విజయ్, పత్తి నాగేశ్వరరావు, మల్లెపు విజయలక్ష్మి, రౌతు రమ్యప్రియ, తదితరులు పాల్గొన్నారు.

300 బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసరాలు..

సత్యనారాయణపురం: కొన్ని వేలమంది వరద బాధితులను దాతల సహకారంతో ఆదుకున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ తెలిపారు. సౌత్‌ఇండియా చారిటబుల్‌ట్రస్ట్ ,అక్షయపాత్ర, ధ్వని, దోశ ఫౌండేషన్, ఎలైట్ బ్రాహ్మిణ్ ఎన్‌జీవో సంస్థల ఆధ్వర్యంలో జీఎస్‌రాజురోడ్డులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం 300బ్రాహ్మణ కుటుంబాలకు ముఖ్య అతిథి యామినీ శర్మ నిత్యావసరాల కిట్లు, బియ్యం అందజేశారు. సత్యనారాయణపురం పురోహితుల సంఘం అధ్యక్షుడు చైతన్యవర్మ, టీడీపీ నేత జగన్మోహనరాజు, అశ్వనీకుమార్, దోశఫౌండేషన్ ప్రతినిధి కల్లా, నాగిరెడ్డి, కోటిరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

50 మందికి కిట్ల పంపిణీ

ఆయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున 50మందికి దుప్పటి, చీర, లుంగి, టవల్స్‌తో పాటు నిత్యావసరాల కిట్‌ను అందజేశారు. శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, వేణుగోపాల్ రాజు, సాంబశివరావు పాల్గొన్నారు.

వెయ్యిమందికి నిత్యావసరాల పంపిణీ

పటమట: వరద బాధితులను ఆదుకోవాలనే సంకల్పంతో ఆదిత్య కళాశాల యాజమాన్యం ఎస్.శేషారెడ్డి, సుగుణల పిలుపుమేరకు కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, యాజమాన్యం సహకారంతో వెయ్యి మందికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. సింగ్‌నగర్, రాజరాజేశ్వరీపేటల్లో 15 కేజీల బియ్యం, కందిపప్పు, చింతపండు, మినపప్పు, మంచినూనె, మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. ఈ వారంలో మరోవెయ్యి మందికి నిత్యావసరాలను పంపిణీ చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఆదిత్య కళాశాల ఉపాధ్యాయులు

హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

వన్‌టౌన్: విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మెయిన్‌బజార్‌లోని సంఘ కార్యాలయం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథి కరూర్ వైశ్యాబ్యాంక్ వన్‌టౌన్ శాఖ మేనేజర్ పి.వి.బి.రావు గుప్తా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు శీరం బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మసునం కృష్ణారావు పాల్గొన్నారు.

స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో..

పాయకాపురం: వరద బాధిత కుటుంబాలకు ప్రశాంతినగర్‌లోని స్పందన సేవా సమితి కార్యాలయంలో నిత్యావసర సరుకుల పంపిణీని నిర్వహించారు. సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ 50 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. డి.మురళి, కె.నరసింహామూర్తి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పటమట, సెప్టెంబరు 29: బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు ధార్న చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో రామలింగేశ్వర్‌నగర్ పడవలరేవు వంతెన వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాని మోదీ దిశా నిర్దేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సూచనలతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని చంద్రశేఖర్‌రావు వివరించారు. ముప్పల వెంకటసుబ్బయ్య, చక్కా శ్రీను, డీజీ శ్రీఫణి, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

పటమట, సెప్టెంబరు 29: డాక్టర్ జీజే నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా 250 మందికి రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు.

అత్యాధునిక పద్ధతుల్లో కేన్సర్ చికిత్సలు

- రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ హేమటో ఆంకాలజిస్ట్ వీణ అక్కినేని

ఆటోనగర్, సెప్టెంబరు 29: లుకేమియా, లింఫోమా, బ్రెయిన్ క్యాన్సర్, బోన్ కేన్సర్‌లకు రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో అత్యాధునిక పద్ధతుల్లో చికిత్సలు అందిస్తున్నామని పీడియాట్రిక్ హేమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని తెలిపారు. దీంతో కేన్సర్‌తో బాధపడుతున్న పిల్లల జీవించే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయని ఆమె పేర్కొన్నారు. ఆదివారం రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, డెకథ్లాన్ సంయుక్తంగా ఎనికేపాడు డెకాథ్లాన్‌లో చిన్నపిల్లలకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. ఈ పోటీల్లో 5 నుంచి 15 ఏళ్ల కలిగిన 160 మంది పిల్లలు పోటీల్లో పాల్గొన్నారని డాక్టర్ వీణ తెలిపారు. సెప్టెంబరును బాల్యదశలో వచ్చే కేన్సర్‌లపై అవగాహనామాసంగా నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కేన్సర్ చికిత్సలో వచ్చిన అధునాతన ఆవిష్కరణల పట్ల అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్‌ప్రసాద్, హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర్‌చౌదరి పాల్గొన్నారు.



పెయింటింగ్ పోటీల్లో విజేతలకు మెమొంటోలు అందిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రతినిధులు


పేకాటరాయుళ్ల అరెస్టు

చిట్టినగర్, సెప్టెంబరు 29: కొత్తపేటలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 15 మందిని ఆదివారం కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. పోతిన శ్రీనివాసరావు వీధిలో ఓ ఇంట్లో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.51 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజనాగేంద్ర కేసు నమోదు చేశారు.

ఉల్లాసభరితంగా లిటిల్ చాంప్స్ పోటీలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 29: నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో ప్రిన్సిపాల్ మాదల పద్మజ పర్యవేక్షణలో ఆదివారం చిన్నారులకు ఎన్‌వీఎస్ లిటిల్ చాంప్స్ ఒలింపియాడ్, సండే కార్నివాల్ పోటీలు ఉల్లాసభరితంగా నిర్వహించారు. 200 మంది చిన్నారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు గ్లోబ్ టాడ్లర్స్ ప్లేస్కూల్ కరస్పాండెంట్ నీలిమ బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

జగ్గయ్యపేటలో సబ్‌కోర్టు ఏర్పాటుకు వినతి


జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికకు సత్కారం

జగ్గయ్యపేట, సెప్టెంబరు 29: జగ్గయ్యపేటకు సబ్‌కోర్టును మంజూరు చేయాలని, పెనుగంచిప్రోలు మండలాన్ని జగ్గయ్యపేట సివిల్ కోర్టు పరిధిలోకి మార్చాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. **నందిగామ రూరల్:** నందిగామకు వచ్చిన ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణసారికను నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

పవిత్రసంగమం వద్ద సంగమేశ్వర ఆలయం నిర్మించాలి

సీఎంకు వినతి



గొల్లపూడి, సెప్టెంబరు 29: ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద సంగమేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేసినట్టు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు గూడపాటి పద్మశేఖర్ తెలిపారు.

ఏం కొనేట్టులేదు.. తినేట్టులేదు

● నిత్యావసరాలు, కూరగాయల ధరలతో సామాన్యులు బెంబేలు ● కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి ధర





నందిగామ రూరల్, సెప్టెంబరు 29: నిత్యావసర సరుకులు, వంట నూనెలతో పాటు ఆకు, కాయగూరలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు రాష్ట్రాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కిలో రూ.10 నుంచి 30 వరకు ధర పలికే కూరగాయలు నేడు బహిరంగ మార్కెట్‌లో రూ.50 నుంచి 80 వరకు ధర పలుకుతుడటంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక ఉల్లిపాయల ధర వింటే కోయకుండా కంట నీరు తెప్పిస్తుంది. ఉల్లిపాయలు కర్నూలు, మహారాష్ట్రల నుంచి ఇక్కడకు సరఫరా అవుతుంది. కిలో ఉల్లిపాయలు ప్రస్తుతం 65ల ధర పలుకుతుంది. ఆకుకూరల పంటలు కూడా పూర్తిగా తుడిచిపెట్టుకుపోవటంతో రూ. రెండు, మూడు ఉండే బచ్చలకూర, తోటకూర, గోంగూర కట్ట రూ. 10లకు చేరటంతో పేదలు అల్లాడుతున్నారు. ఒకప్పుడు రూ. 500లు వెచ్చిస్తే 10, 15 రోజులకు సరిపడ కూరగాయలు వచ్చేవని నేడు నాలుగు రకాల కాయగూరలు కూడా రావటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రైతుబజార్లు, మార్కెట్‌లకు కూరగాయలు కూడా సరిగ్గా రావటం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదలతో టిఫిన్ సెంటర్, కర్రీ పాయింట్ నిర్వాహకులు సైతం వ్యాపారాలు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిత్యావసర సరుకులు, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి..



పెరుగుతున్న నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలతో అవస్థలు పడుతున్నాం. అకాల వర్షాలకు పంటలు నష్టపోయి రైతులు, పనులు లేక వ్యవసాయ కూలీలు అవస్థలు పడుతున్నారు. పెరిగిన ధరలతో మూడు పూటల సంగతెలా ఉన్న కనీసం రెండు పూటలా తినటం కూడా కష్టంగానే ఉంది. ప్రభుత్వం స్పందించి ధరలు సామాన్యులకు అందుబాటులో తీసుకురావాలి.

\- పూలవెన్ను కృష్ణమోహన్

నష్టాలతోనే వ్యాపారం చేస్తున్నాం..



నిత్యావసర సరుకుల ధరలు పెరగటంతో వ్యాపారంలో నష్టం వాటిల్లుతుంది. టిఫిన్‌లలోకి వివిధ రకాల కూరగాయలతో పాటు ఉల్లిపాయలు అధికంగా వినియోగించాలి. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని టిఫిన్ ధరల పెంచితే వినియోగదారులు రావటం లేదు. తక్కువ ధరకు విక్రయిస్తే నష్టాలు వస్తున్నాయి. మా జీవనం సాగాలంటే చేసేది లేక నష్టాలతోనే వ్యాపారాలు సాగిస్తున్నాం.

\- శ్రీదేవి, టిఫిన్ సెంటర్


కవులూరులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత

నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు, సెప్టెంబరు 29: వరదల వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ భరోసా ఇచ్చారు. పంట నష్టం అంచనాలో తమకు అన్యాయం జరిగిందని కవులూరు గ్రామ రైతులు ఆందోళన చెందుతుండటంతో ఎమ్మెల్యే నేరుగా ఆదివారం కవులూరు ఆర్బీకే వద్దకు చేరుకొని రైతులతో చర్చించారు. పంటనష్టం అంచనా పారదర్శకంగా చేయించి ప్రతి రైతుకు పరిహారం అందేలా చూస్తామన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని వ్యవసాయశాఖ కమిషనర్‌కు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు కూడా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో గరిమెళ్ల శ్రీనివాసరావు, బొర్రా అశోక్‌కుమార్, తాడికొండ భాస్కరరావు, బొర్రా హనుమంతరావు, బొర్రా సాంబశివరావు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ కస్తూరిబాయి

తిరువూరు, సెప్టెంబరు 29: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయి ఆటల పోటీలు ఆదివారం జడ్పీ బాలికల పాఠశాలలో ప్రారంభమైయ్యాయి. ఈ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ప్రారంభించారు. బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారు ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ లోవరాజు, ఎంపీపీ గద్దల భారతి, వాహిని ఇంజనీరింగ్ కాలేజీ ఏవో ముత్యాల కిషోర్‌బాబు, జొన్నాడ రంగారావు, మునిసిపల్ వైస్‌చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం



నందిగామ రూరల్, సెప్టెంబరు 29: దాములూరుకు చెందిన రైతులు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరదలకు పంటలు ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన హామీ మేరకు వరద ముంపుకు గురైన 10 రోజుల్లోనే రైతుల ఖాతాలలో రూ. 10 వేలు జమ చేసి ఆదుకున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు చల్లా తులసీరావు, గింజుపల్లి శ్రీనివాసరావు, చెరుకూరు సాంబశివరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణా తరగతులు

తిరువూరు: దసరా సెలవులు పురస్కరించుకొని గ్రంథాలయంలో విద్యార్థులకు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, గ్రంథాలయం అధికారిణి కె.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్రలేఖనం, యోగా, చదరంగం, జనరల్ నాలెడ్జి తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే అజెండాగా కూటమి పాలన : ఎమ్మెల్యే సౌమ్య


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ రూరల్, సెప్టెంబరు 29: ప్రజా సంక్షేమమే అజెండాగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. చెరువుకొమ్ముపాలెం, పెద్దవరం, కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. కేవీకే, పెద్దవరం గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 35 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. క్రక్స్ బయోటెక్ కంపెనీ సహకారంతో కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

చేరికలు..

చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు చిలకమ్మతో పాటు పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నాయకులు ఇంటూరి సీతయ్య, వీరంకి వీరాస్వామి, లక్ష్మీ నరసింహం, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

అపర్ణకు అభినందనలు..

నందిగామ : ఏపీ క్రికెట్ అండర్-19కు ఎంపికైన పోపూరి లక్ష్మీ అపర్ణను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందించారు. చందర్లపాడు మండలం తుర్లపాడుకు ఆమె భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వరద ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతాం

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, సెప్టెంబరు 29: వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. జగ్గయ్యపేటలో ముంపునకు గురైన ధనం బోడు, విద్యానగర్, దుర్గాపురం కాలనీల్లో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదివారం పర్యటించారు. రైల్వే అండర్‌పాస్ వద్ద నీటిని తొలగించాలని ఆదేశించారు. బురదకయ్యగా మారిన ప్రాంతాల్లో గ్రావెల్ పోయాలని పురపాలకసంఘ అధికారులను ఆదేశించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కట్టా నరసింహారావు, షైనేని రాధాకృష్ణ, వేదు లాపురి సైదా, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, అస్లాం, గింజుపల్లి కృష్ణ, రహీం పాల్గొన్నారు.

ఆసుపత్రికి బాధితుల తరలింపు

పట్టణంలో ఎస్జీఎస్ కళాశాల సమీపంలో ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో తొర్రగుంటపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తన వాహనంలో ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి కృషి

నియోజకవర్గంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హామీ ఇచ్చారు. టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ భవనంలో అధ్యక్షుడు కాకరపర్తి వెంకటరమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తాతయ్య త్వరలోనే ప్రెస్‌క్లబ్‌కు మంచి స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణం చేయిస్తామని, నివేశన స్థలాలు, ప్రమాద బీమాతోపాటు పలుసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్య క్షుడు వీర్ల శ్రీరాంయాదవ్, ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లికార్జునరావు మాట్లాడుతూ జర్న లిస్టుల హెల్త్ ఇన్సూ రెన్స్‌ను రూ.10 లక్షలకు పెంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నేతలు వైవీ రమణ, చైతన్య, సుభాష్, జిల్లా అధ్యక్షుడు విజయ్‌బాబు, కార్యదర్శి సూర్యప్రకాశ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొర్రా వెంకటేశ్వరరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ముఖేష్ కుమార్ మీనా

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29: ఇబ్రహీంపట్నం మాజీ జడ్పీటీసీ సభ్యుడు బొర్రా వెంకటేశ్వరరావు మృతి విషయం తెలుసుకున్న గనులు, ఎక్సైజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కొండపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిరణ్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

జగ్గయ్యపేట, సెప్టెంబరు 29: రజక బజార్, చింతల తోపులో 40 వరద బాధిత కుటుంబాలకు లయన్స్ క్లబ్ సభ్యులు దుస్తులు, దుప్పట్ల కిట్‌ను క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం బదరీనారాయణ, కార్యదర్శి బండారు రవి తదితరులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిటిల్ ఏంజిల్స్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మహేష్, కరుణాకర్, మోహన్‌బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జి.కొండూరు: నాయుడుపేట వద్ద జరిగిన లారీ ప్రమాదంలో మృతిచెందిన ప్రత్తిపాటి కార్తిక్‌కు కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ యరమల సంజీవరెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. యరమల గోపాల్ రెడ్డి. టి.విజయారెడ్డి, పి.మరియన్న, పియాకోబు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు


కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట, సెప్టెంబరు 29: పట్టణానికి చె ందిన మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండా, భీమవరం, వేమవరం గ్రామ ఎంపీటీసీ సభ్యులు నార్ల సుధాకరరెడ్డి, ఫణితి గోపాలకృష్ణ జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వీరయ్య చౌదరి, శ్రీనివాస్ చేరారు.

అమ్మిరెడ్డిగూడెంలో..

గంపలగూడెం: అమ్మిరెడ్డిగూడెంలో 50మంది వైసీపీ కార్యకర్తలు ఆదివారం జనసేన తీర్థం తీసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ వైసీపీ నుంచి వచ్చిన పల్లపు అమరయ్య, బత్తుల గణేష్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తోటమూల నుంచి జనసైనికులు ర్యాలీగా చేరుకున్నారు. నాయకులు సూరంశెట్టి రామారావు, బాలకృష్ణ, వెంకట కృష్ణారావు, చింతల లక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి గాయాలు

తిరువూరు, సెప్టెంబరు 29: బైపాస్‌లో జరిగిన రోడ్డుప్రమాదంలో వనపర్తి గోపి(25)మృతి చెందగా, అదంకి మణికంఠ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. సుందరయ్య కాలనీకి చెందిన గోపి, మణికంఠ బైక్‌పై ఖమ్మం జిల్లా ముత్తగూడెం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బైపాస్‌లో విజయవాడ నుంచి వస్తున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

డిజిటల్ భారత్ నిధి

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సమాచారమే ఇంధనం. అన్ని రంగాల్లో తారతమ్యాలు ఉన్నట్లే, సమాచార ప్రసారంలో కూడా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్నంత సమాచార వ్యాప్తి మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం లేదు. కారణంగా సమాచార సమ్మిళితత్వం కొరవడి విద్య, ఆర్థిక, సాంకేతికపరమైన అంతరాలు ఇంకా విస్తరిస్తున్నాయి. 'వన్ నేషన్ - వన్ మార్కెట్', 'ఈ-నామ్' వంటి ప్రభుత్వ సమ్మిళితాభివృద్ధి చర్యలు మారుమూల ప్రాంత రైతులు, చేతివృత్తుల వారు, వ్యాపారుల వరకూ చేరలేకపోతున్నాయి.

దీనికి కారణం ప్రైవేటు టెలికం ఆపరేటర్లకు పట్టణాల్లో ఉత్పన్నమయ్యే ఆదాయం గ్రామీణ ప్రాంతాల నుంచి లభించకపోవడం. జనసాంద్రత తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలతో పోలిస్తే నిర్వహణ వ్యయాలు అధికంగా ఉండటం. అయితే, ప్రైవేటురంగం వెనకడుగు వేసిన సమయాల్లో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంటుంది. ఈ నిమిత్తం బీఎస్ఎన్ఎల్ ఒక ప్రత్యామ్నాయంగా కొనసాగినప్పటికీ నిధులు, నిర్వహణాపరమైన సమస్యలతో కూనరిల్లుతోంది. ఈ నేపథ్యంలో సంస్థాగత మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' ప్రణాళికలో భాగంగా 1885 నాటి 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని' రద్దుచేసి, 2023లో 'టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్'ను తీసుకువచ్చింది. టెలికాం రంగంలో పెట్టుబడులను విస్తరించడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా టెలికం సేవలు విస్తరించి సమ్మిళిత సమాచార వ్యవస్థను రూపొందించడానికి టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్-2023లో 'డిజిటల్ భారత్ నిధి' ఏర్పాటును అంతర్భాగం చేశారు.

అయితే టెలికం రంగంలో ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు సేవలను విస్తరించేందుకు నిధుల సమీకరణ నిమిత్తం 2003లో ఏర్పాటు చేసిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్(యూఎస్ఓఎఫ్)' స్థానంలో ఈ డిజిటల్ భారత్ నిధిని తీసుకువచ్చారు.

యూఎస్ఓఎఫ్ రద్దుకు కారణాలు

ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌కు సవరణలు చేసి 2003లో ఈ 'యూఎస్ఓఎఫ్' నిధిని మారుమూల ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించేందుకు పెట్టుబడులు జమ చేసే ప్రత్యేక నిధిగా రూపొందించారు.

టెలికాం ఆపరేటర్ల అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ(ఏజీఆర్-సవరించిన స్థూల ఆదాయం)పై 5 శాతం లెవీ విధించడం ద్వారా ఈ నిధికి వనరులు సమకూరేవి. అయితే ఈ నిధిని స్థాపించిన నాటినుంచి వనరుల అసమర్థ వినియోగం గురించిన విమర్శలను ఎదుర్కొంటూనే ఉంది.

2017-22 మధ్యకాలం చూసుకుంటే ఈ నిధికి రూ.41,740 కోట్లు జమ అవగా, ఖర్చు చేసిన మొత్తం మాత్రం రూ. 30, 213 కోట్లు (72 శాతం)గా ఉంది. ఈ నిధుల్లో అత్యధిక



భాగం గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికాం అనుసంధానత విస్తరించడానికి 'భారత్ నెట్ ప్రాజెక్టు' ద్వారా వినిమయం చేయడానికి కేటాయించినా అవి పూర్తిస్థాయిలో వ్యయం చేయలేదు.

ఈ లోపాలను అధిగమించి, టెలికాం రంగంలో మరింత విస్తారమైన సేవలు, వినూత్న కార్యాచరణలు ప్రతిపాదిస్తూ 'డిజిటల్ భారత్ నిధి'కి రూపకల్పన చేశారు. ఈ నిధిని టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్ 2023, సెక్షన్ 24(1) ప్రకారం ఏర్పాటు చేశారు.

డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్)

యూఎస్ఓఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ డిజిటల్ భారత్ నిధి కార్యాచరణ పరిధిని మరింత విస్తరించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్స్ సేవలు విస్తరించడంతోపాటు, టెలీ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సాంకేతికతలు, ఉత్పత్తుల అభివృద్ధికి, వివిధ రంగాల్లో పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), పైలెట్ ప్రాజెక్టులకు, బలహీన వర్గాలు, వికలాంగులు, స్త్రీలు, స్వయం సహాయక సంఘాలు వంటి వారికి సహాయం చేసే పథకాలు/ప్రాజెక్టులకు ఈ నిధి నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. అదేవిధంగా టెలికాం ఆపరేటర్ల నుంచి వసూలు చేసిన నిధులు(డీబీఎన్ నిధులు) టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్(2023) సెక్షన్ 25 ప్రకారం తొలుత సంఘటిత నిధికి జమ అవుతాయి. తదుపరి కేంద్రప్రభుత్వం ఆ నిధులను పార్లమెంటు ఆమోదంతో డీబీఎన్‌కి బదలాయిస్తుంది.

ఈ నిధికి సంబంధించి ప్రాధికార సంస్థ అయిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్' ఇటీవల డిజిటల్ భారత్ నిధి నిర్వహణ నియమావళిని విడుదల చేసింది. ఈ నిధిని నిర్వహించే అడ్మినిస్ట్రేటర్ నియామకం, విధులు, నిధి లక్ష్యాలను అమలుచేసే ఇంప్లిమెంటర్(అమలుదారు) ఎంపిక వంటి అంశాల గురించి విశదీకరించడం జరిగింది. ఈ నియమావళి ప్రకారం, కేంద్రప్రభుత్వం డిజిటల్ భారత్ నిధికి ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. బిడ్డింగ్ లేదా నామినేషన్ ద్వారా అమలుదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం, వారిని సమయానుసారం పర్యవేక్షించడం, వివాదాల పరిష్కారం, నిధుల పంపిణీ, నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం, మూల్యాంకనం తదితర విధులను అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటాడు.

అమలుదారుల ఎంపిక ప్రాథమికంగా రెండు విధాలుగా ఉంటుందని నియమావళి సూచిస్తోంది. టెలీ కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రమోషన్ కోసం అమలుదారులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. అదే పరిశోధన, అభివృద్ధి కోసం అయితే అప్లికేషన్ ఆధారిత ఎంపిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఆపరేటర్స్‌ను నామినేట్ చేసే విచక్షణాధికారాన్ని అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటారు. టెలీ కమ్యూనికేషన్స్ సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చడం, నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతల అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్ రంగంలో నవకల్పనలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు మద్దతు ఇవ్వడం వంటి కార్యక్రమాలకు గాను అమలుదారుకు నిధులను కేటాయిస్తారు.

ఈ నిధులను అందరికీ ఒకే తరహాలో కాక, అమలుదారుల కార్యకలాపాలను ఆధారం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ వారికి పూర్తిగా లేదా పాక్షికంగా కానీ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, కో ఫండింగ్ తరహాలో నష్టభయాలను తగ్గించుకునేవిధంగా నిధుల కేటాయింపును నిర్ణయిస్తాడు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

డీబీఎన్ ద్వారా ఆశిస్తున్న ప్రయోజనాలు

1. సమాచార యుగం లో డిజిటల్ అంతరాలను రూపుమాపి, ప్రతీ ఒక్కరికీ సమాచార విప్లవ ఫలితాలు అందేలా డిజిటల్ సమ్మిళితత్వాన్ని తీసుకురావడం. తద్వారా ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించడం.
2. టెలికాం రంగంలో రాబోయే సరికొత్త తరం టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి వ్యవస్థాగత సంసిద్ధత, అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి. ఉదాహరణకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో 5జీ టెక్నాలజీని అందిపుచ్చుకునే సంసిద్ధత సాధించే లోపే 6జీ ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. 5జీ కన్నా వెయ్యిరెట్లు వేగవంతమైన 6జీని భారత్‌లో ప్రవేశపెట్టాలంటే మరింత మెరుగైన ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థ, అనుసంధానతలపరమైన నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతలను అభివృద్ధి పర్చుకోవాల్సి ఉంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి డీబీఎన్ నిధి సహకరిస్తుంది.
3. ప్రపంచస్థాయి ప్రమాణాల సాధన ద్వారా భారత టెలికాం రంగాన్ని అభివృద్ధి చేయడం, తద్వారా డిజిటల్ మార్కెట్‌ల విస్తృతి మరింత పెంచి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం. వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నేడు ఆటోమేటిక్ రూట్ ద్వారా అవకాశం ఉన్న సందర్భంలో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.
4. టెలికాం రంగ అభివృద్ధి ద్వారా ఈ-గవర్నెన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ వంటి పారదర్శక విధానాలను ప్రభుత్వ పాలనలో తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడం.
5. టెలికాం రంగంలో నవకల్పనలను, స్టార్టప్‌లను, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని టెలికాం రంగ హబ్‌గా మార్చడం. రాబోయే కాలంలో మెటావర్స్, డ్రైవర్‌లెస్ కార్ల వంటి టెలికాం రంగ అనుసంధానత గల విప్లవాత్మక రంగాల్లో ఎర్లీ బర్డ్ అడ్వాంటేజ్‌ను సొంతం చేసుకోవడం.

అయితే ఇలాంటి ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలను, సైబర్ సెక్యూరిటీ సమస్యలను, ఈ-వేస్ట్ నిర్వహణ లోపాలను అధిగమించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా టెలీడెన్సిటీ పరంగా 133.76%గా ఉన్న పట్టణస్థాయికి 58.56%గా ఉన్న గ్రామీణ స్థాయికి మధ్య ఉన్న భారీ అంతరాన్ని తగ్గించడానికి డీబీఎన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాల్సి ఉంది. అప్పుడే భారత్ డిజిటల్ ఇండియా కల సంపూర్ణంగా సాకారమవుతుంది.

నంబర్ రిపీట్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-1

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో అనేక సంఖ్యల క్రమం(లాంగ్ నంబర్ సిరీస్) లేదా వర్ణమాల అక్షరాల క్రమం (ఆల్ఫాబెటికల్ లెటర్ సిరీస్) ఇస్తారు. ఈ రకమైన ప్రశ్నలకు అభ్యర్థి ముందుగా ప్రశ్నలో ఇచ్చిన నియమాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకొని కచ్చితంగా అదే నియమాన్ని అనుసరిస్తున్న సంఖ్యల సమూహాలు లేదా వర్ణమాల అక్షరాల సమూహాలు ఇచ్చిన సిరీస్‌లో ఎన్నిసార్లు వచ్చిందో సరిచూసుకొని నాలుగు ఆల్టర్నేటివ్ చాయిస్‌ల నుంచి సమాధానాన్ని గుర్తించాలి.

గమనిక: ఈ టెస్ట్‌కి సంబంధించిన ప్రశ్నలలో సాధారణంగా మూడు సంఖ్యలు లేదా మూడు వర్ణమాల అక్షరాలను ఒక సమూహంగా భావించాలి. (ముందు అనగా ఎడమవైపు, తరవాత అనగా కుడివైపు అని అర్థం)

1. కింది సంఖ్యాక్రమంలో ముందు 2 ఉండి, తరవాత 4 గల 3లు ఎన్ని ఉన్నాయి?
6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6
ఎ) మూడు బి) నాలుగు సి) రెండు డి) ఏమీలేవు
సమాధానం: (ఎ)
వివరణ: 6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

పై ప్రశ్నలో '3'లు గురించి అడిగారు. కాబట్టి '3' 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 2 ఉండటం అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3'కి ఎడమవైపు 2 ఉండాలని అర్థం. తరవాత 4 అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3' కి కుడివైపు 4 ఉండాలి. అనగా 234 అనే సమూహాలు మూడు ఉన్నాయి.

2. కింది సంఖ్యాక్రమంలో ముందు 4 లేకుండా, తరవాత 6గల '5'లు ఎన్ని ఉన్నాయి?
6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) అయిదు
సమాధానం: (సి)
వివరణ: 6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

పై ప్రశ్నలో '5'లు గురించి అడిగారు. కాబట్టి '5' 'బేసిక్'గా తీసుకోవాలి. తరవాత 6 గల అనగా 5కి కుడివైపు 6 ఉండటం అని అర్థం. అనగా 56. ముందు 4 లేకుండా అనగా 5కి ఎడమవైపు 4 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 56కి ముందు(ఎడమవైపు) 4 లేని సమూహాలు నాలుగు ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 35656 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

3. కింది సంఖ్యాక్రమంలో ముందు 7 ఉండి, తరవాత 9 లేని '8'లు ఎన్ని ఉన్నాయి?
8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5
ఎ) మూడు బి) అయిదు సి) నాలుగు డి) ఆరు
సమాధానం: (బి)
వివరణ: 8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

పై ప్రశ్నలో 8లు గురించి అడిగారు. కాబట్టి '8'ని 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 7 ఉండి అనగా 8కి ఎడమవైపు 7 ఉండటం అని అర్థం అనగా 78. తరవాత 9 లేకుండా అనగా 8కి కుడివైపు 9 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 78కి తరవాత (కుడివైపు) 9 లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 78786 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

4. కింద ఇచ్చిన వర్ణమాల క్రమంలో ముందు 'L' ఉండి, తరవాత 'N' లేని 'M' లు ఎన్ని ఉన్నాయి?
J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K
ఎ) 3 బి) 4 సి) 5 డి) ఏమీలేవు
సమాధానం: (ఎ) అవుతుంది.
వివరణ: J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K ఇచ్చిన ప్రశ్నలో ముందు 'L' ఉండి తరవాత 'N' లేని 'M' లు అనగా LM ఉండి 'N' ఉండకూడదు.

Mలు ఎన్ని ఉన్నాయని అడిగారు. కాబట్టి 'M'ని బేసిక్‌గా తీసుకోవాలి. ముందు 'L' ఉండి అనగా 'M'కి ముందు అనగా ఎడమవైపు 'L' ఉండాలి అనగా 'LM'. తరవాత 'N' లేని అనగా 'N' కి కుడివైపు 'N' ఉండకూడదు.



ఈ ప్రశ్నలో Mకు ముందు 'L' ఉండి తరవాత 'N' లేని అక్షర సమూహాలు మూడు ఉన్నాయి. సమాధానం (ఎ) అవుతుంది.

5. కింది వర్ణమాల క్రమంలో ముందు A లేకుండా, తరవాత C లేకుండా గల 'B'లు ఎన్ని ఉన్నాయి?
C D B A G C B B D F C B A B C E B A B G
ఎ) అయిదు బి) మూడు సి) నాలుగు డి) ఆరు
సమాధానం: (ఎ)
వివరణ: C D B A G C B B D F C B A B C E B A B G

పై ప్రశ్నలో 'B'లు గురించి అడిగారు. కాబట్టి Bను 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు A లేకుండా అనగా 'B'కి ఎడమవైపు A ఉండకూడదు. తరవాత 'C' లేని అనగా 'B' కి కుడివైపు 'C' ఉండకూడదు. ప్రశ్నలో ఇచ్చిన ప్రతి 'B'ని పరిశీలిస్తే Bకి ఎడమవైపు Aలేని, Bకి కుడివైపు 'C' లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనిక: పై సిరీస్‌లో CBBD అనే 4 అక్షరాలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.




డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కళాశాలల్లో ఇదేం సంస్కృతి?!

ర్యాగింగ్‌ను మించి వికృత చేష్టలు

- విద్యార్థినులపై అసభ్య కామెంట్లు
- గంజాయి, డ్రగ్స్‌పైనే ఎక్కువ చర్చ
- కాలేజీల్లో చేయిదాటుతున్న పరిస్థితి
- ప్రైవేటు వర్సిటీల్లోనూ పెడపోకడలు
- అడ్డుకట్ట వేయకపోతే ప్రమాదమే
- గ్రీవెన్స్ కమిటీలపై పర్యవేక్షణ నిల్
- ఫిర్యాదులు పట్టని యాజమాన్యాలు
- ఏఐసీటీఈ, యూజీసీ నిబంధనలు గాలికి

అది విజయవాడ నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొంది అందులో చేరిన ఒక విద్యార్థినికి రెండు రోజులకే చేదు అనుభవం ఎదురైంది. కొందరు విద్యార్థులు ఆ అమ్మాయిని భౌతికంగా తాకే ప్రయత్నం చేశారు. ఆమెను తరగతి వాట్సాప్ గ్రూపులో చేర్చి అసభ్యకరమైన కామెంట్లు చేశారు. ఇవన్నీ చూసి భయాందోళన చెందిన ఆ విద్యార్థిని దీనిపై అధ్యాపకులకు ఫిర్యాదు చేసింది. అయితే "కాలేజీల్లో ఇవన్నీ రొటీన్... పట్టించుకోకూడదు..." అని యాజమాన్యం నుంచి సమాధానం రావడంతో ఆమె తల్లిదండ్రులు ఆ కాలేజీ నుంచి టీసీ తీసుకొని బయటపడ్డారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినుల దుస్తులపై వెకిలి జోకులు... గంజాయి కోసం ఆరాలు... మరింత కిక్ ఇచ్చే డ్రగ్స్ ఏమిటంటూ చర్చలు... యువత భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కాలేజీల్లో సాగుతున్న ఆందోళనకరమైన ట్రెండ్ ఇదీ... కళాశాలల్లో చక్కటి నైపుణ్యాలు సొంతం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన విద్యార్థులు పెడదారి పడుతున్నారు. పుస్తకాలు, పరీక్షలు, మార్కుల గురించి కాకుండా గంజాయి, డ్రగ్స్‌పై చర్చిస్తున్నారు. కొందరు విద్యార్థులు వాటి మాయలో చిక్కి మత్తులో చిత్తవుతున్నారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇదే వ్యవహారం నడుస్తోంది. పెద్దగా పేరులేని కాలేజీల నుంచి ప్రముఖ విద్యాసంస్థల వరకూ, కొన్ని ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ ఈ పోకడ నానాటికీ పెరుగుతోంది. ఒకప్పటి ర్యాగింగ్ సంస్కృతి ఇప్పుడు వికృత ధోరణిగా రూపుదాల్చింది. కాలేజీల్లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళా గ్రీవెన్స్ కమిటీలు నామమాత్రంగా మారాయి. కేవలం ఉన్నాయని చూపించుకోవడానికి మినహా అవి ఎందుకూ ఉపయోగపడటం లేదు. అసలు ఫిర్యాదులు కాలేజీని దాటి యూనివర్సిటీ స్థాయికి చేరకుండా కొన్ని యాజమాన్యాలు తొక్కిపెడుతున్నాయి. కళాశాల స్థాయిలోనే పరిష్కారమైనట్లు చూపిస్తున్నా, ఎక్కడా ఫిర్యాదులను పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. తాజాగా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో బయటపడిన రహస్య కెమెరాల వ్యవహారంతో కాలేజీల్లో ఆకృత్యాల వ్యవహారం చర్చనీయాంశమైంది.

◆ ఇవీ నిబంధనలు

కాలేజీల్లో కమిటీల ఏర్పాటుకు సంబంధించి ఏఐసీటీఈ, యూజీసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ, మహిళలపై వేధింపుల నిరోధక కమిటీ కచ్చితంగా ఉండాలి. భౌతికంగా విద్యార్థులను వేధించినా, ఇబ్బందికరమైన కామెంట్లు చేసినా, కాలేజీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించినా, ఎవరిపై అయినా దుష్ప్రచారం చేసినా ఈ కమిటీలకు ఫిర్యాదు చేయొచ్చు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులతో కూడిన ఈ కమిటీల్లో కనీసం ఐదుగురు సభ్యులు ఉంటారు. అందులో కనీసం ముగ్గురు మహిళలు ఉండాలి. తొలుత కాలేజీ స్థాయిలో ఫిర్యాదులపై విచారణ చేస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత యూనివర్సిటీ కమిటీకి పంపుతారు. అక్కడ రిటైర్డ్ జడ్జి స్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తారు.

◆ కాలేజీల్లో జరుగుతున్నది ఇదీ..

ఏఐసీటీఈ నిబంధనలను కాలేజీ యాజమాన్యాలు నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యార్థినులపై వేధింపులు, విద్యార్థులపై ర్యాగింగ్ చేసినా బాధితులు ఫిర్యాదు చేయడానికే భయపడుతున్నారు. కాలేజీల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతో యాజమాన్యాలు ఈ కమిటీలను నామమాత్రం చేశాయి. తమ కాలేజీలో ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు లేవని చూపించడానికి ప్రయత్నిస్తున్నాయి. అడ్మిషన్లు పెంచుకోవాలని, బ్రాండ్ ఇమేజ్‌ను మెరుగుపర్చుకోవాలని చూస్తున్నాయి. దీంతో ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదనే భావనతో ఎవరూ ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడం లేదు.

వైసీపీ సర్కారు పుణ్యమే

ఉన్నత విద్యాసంస్థల్లో వికృత చేష్టలు ఇప్పుడే కొత్త కాకపోయినా కొంతకాలంగా ఈ ధోరణి పెరగడానికి గంజాయి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి గ్రామస్థాయికీ చేరిపోయింది. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో దీని వినియోగం బాగా పెరిగింది. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని మరీ గంజాయి ఎక్కడ దొరుకుతుందని విద్యార్థులు ఆరా తీస్తున్నారు. గంజాయి వినియోగించి తోటి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు శృతిమించిన కామెంట్లు చేస్తున్నారు. కాలేజీలకు గంజాయి, డ్రగ్స్ చేరకుండా నియంత్రిస్తే, ఇతర వేధింపులు కూడా ఆగే అవకాశం ఉంది.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత

విద్యా రంగంలో ప్రమాణాలు పెంచడంతో పాటు కాలేజీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. గత ప్రభుత్వంలో అటు చదువులు, ఇటు ఫిర్యాదులు రెండింటినీ పట్టించుకోకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగింది. అందువల్లే పేరున్న కాలేజీల్లో కూడా పిల్లలను చేర్పించాలంటే తల్లిండ్రులు భయపడే పరిస్థితి వచ్చింది. రోజూ కాలేజీకి వెళ్లొచ్చే వారికంటే హాస్టళ్లలో ఉండే వారు తొందరగా తప్పుదారి పడుతున్నారు. జూనియర్ కాలేజీలతో పోలిస్తే ఎక్కువ స్వేచ్ఛ ఉండటం, తల్లిదండ్రులు దూరంగా ఉండటం, కాలేజీ యాజమాన్యాల నిర్లక్ష్యంతో ఉన్నత విద్యాసంస్థల్లో వికృత పోకడ పెరుగుతోంది. దీనిపై ఇప్పుడే కఠినంగా వ్యవహరించకపోతే విద్యార్థుల చదువులతో పాటు, రాష్ట్ర ఇమేజ్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.

ముఫ్తీ ఎన్నికల ప్రచారం రద్దు

- హిజ్బుల్లా నేత నస్రల్లా హత్య నేపథ్యంలో నిర్ణయం
- పాలస్తీనా, లెబనాన్ ప్రజలకు సంఘీభావంగా ప్రకటన

శ్రీనగర్, సెప్టెంబరు 29: హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయిల్ అంతమొందించిన నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆదివారం తన ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. పాలస్తీనా, లెబనాన్ దేశాల ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్న దృష్ట్యా వారికి సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె 'ఎక్స్'లో ప్రకటించారు. మరోవైపు నస్రల్లా హత్యకు నిరసనగా శ్రీనగర్‌లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు శనివారం నల్లజెండాలతో ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించారు. ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేక నినాదాలను హోరెత్తించారు. ఈ ర్యాలీలలో చిన్నపిల్లలు కూడా పాల్గొన్నారని అధికారులు తెలిపారు. కాగా, మెహబూబా ముఫ్తీ ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకోవడం 'రాజకీయ స్టంట్' అంటూ బీజేపీ విమర్శించింది. 'నస్రల్లాను చంపితే ముఫ్తీకి బాధ కలిగింది. మరి బంగ్లాదేశ్‌లో హిందువులను చంపినప్పుడు ఆమె ఎందుకు మౌనంగా ఉన్నారు. ఇదంతా నకిలీ సానుభూతి. ఆమెవి మొసలి కన్నీళ్లు. ప్రజలు అన్నీ అర్థం చేసుకుంటారు' అని బీజేపీ నాయకుడు కవిందర్ గుప్తా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని మరో బీజేపీ నేత అల్తాఫ్ ఠాకూర్ కూడా ముఫ్తీది ఎన్నికల స్టంట్ అంటూ తప్పుబట్టారు. కాగా, నస్రల్లా హత్య నేపథ్యంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, మతతత్వ పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని కశ్మీర్ సైబర్ పోలీసులు హెచ్చరించారు. 'మత సామరస్యానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పెట్టిన మతతత్వ, ఉద్రిక్తతలను ప్రేరేపించే పోస్టులను మేం గమనించాం. అలాంటి విద్వేష పోస్టులు పెట్టొద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం' అని ఒక అడ్వైజరీని సైబర్ పోలీసులు 'ఎక్స్'లో పోస్టు చేశారు. శాంతికి విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర మంత్రి నిర్మల రాజీనామా చేయాలి

- కేసు నమోదు నేపథ్యంలో కాంగ్రెస్ డిమాండ్
- ఎలక్టోరల్ బాండ్లతో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసింది
- బాండ్ల స్కీమ్ కుట్రతో పలు మార్గాల్లో డబ్బు దోపిడీ
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్‌తో దర్యాప్తు జరిపించాలని డిమాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఎన్నికల బాండ్ల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో ఆమె తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ ద్వారా అధికార బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించింది. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, అభిషేక్ మనుసింఘ్వీ ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరిపించాలన్న తమ పార్టీ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. ఈ బాండ్ల కుట్ర ద్వారా 'ముందస్తు లంచం, పని పూర్తయిన తర్వాత లంచం, దాడుల తర్వాత లంచాలు' వంటి తదితర రూపాల్లో డబ్బు దోపిడీ జరిగిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయంగా, న్యాయపరంగా, నైతికంగా ఆర్థిక మంత్రి సీతారామన్ దోషిగా నిలిచారని, ఆమె వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, దీనితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సింఘ్వీ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్రలు చేసిందన్నారు. 'ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దోపిడీని కేంద్ర ఆర్థిక మంత్రి సొంతంగా అయితే చేయలేదు. దీని వెనుక ఉన్న నంబర్ 1, 2లు ఎవరో మనకు తెలుసు. వారి ఆదేశాల మేరకు ఆమె ఇది చేశారు' అని ఆరోపించారు. ప్రజాస్వామ్య మనుగడకు స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు అత్యంత ముఖ్యమని, అయితే మన ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి జరుగుతోందని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను ఆయన 'దోపిడీదారుల బీజేపీ స్కీమ్'గా వర్ణించారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌పై దాఖలైన పిటిషన్ మేరకు బెంగళూరులోని స్థానిక ప్రత్యేక కోర్టు ఆదేశాలతో పోలీసులు శనివారం సీతారామన్ సహా పలువురు ఈడీ అధికారులు, బీజేపీ జాతీయ, రాష్ట్రస్థాయి నేతలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

'ఆయుష్మాన్ భారత్'లో అర్హులైన వృద్ధులను చేర్చండి

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం

Ayushman Bharat Yojana

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' పథకంలో అర్హులైన వృద్ధులను చేర్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 70 ఏళ్లు, ఆ పైన వయసున్న వారిని ఈ పథకంలో చేర్చాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ఎల్.ఎస్.చాంగ్‌సాంగ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ పథకంలో వృద్ధుల నమోదుకు ఆయుష్మాన్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలనుకునే వృద్ధులు యాప్ లేదా పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాదంతా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ పథకం కింద సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆరోగ్య బీమా (ఏడాదికి రూ.5 లక్షలు) వర్తిస్తుందని తెలిపారు. ఆధార్‌లో ఉన్న వయసు ఆధారంగా వృద్ధులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాబిల్లిపై అతి పురాతన బిలం..!

- ఇది 8.35 బిలియన్ ఏళ్ల క్రితం నాటిది.. ల్యాండర్ దిగింది ఇక్కడే: శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఇస్రో ప్రతిష్ఠాత్మక మూన్ మిషన్ చంద్రయాన్-3కు సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. చంద్రయాన్-3 మిషన్, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై ఉన్న అతిపురాతన బిలంపై దిగి ఉండొచ్చని తెలిపారు. సుమారు 160 కిలోమీటర్ల వ్యాసం కలిగిన ఈ బిలం 8.35 బిలియన్ సంవత్సరాల క్రితంనాటి నెక్టేరియన్ కాలంలో ఏర్పడి ఉంటుందని, ఇది చంద్రుని చరిత్రలో అత్యంత పురాతనమైన కాలాల్లో ఒకటని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ, ఇస్రో శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఆ వివరాలను ఇకారస్ అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. 'చంద్రయాన్-3 దిగిన ప్రాంతం మరే ఇతర మిషన్లూ వెళ్లని ఒక ప్రత్యేకమైన భౌగోళిక వాతావరణంలో ఉంది. ల్యాండర్‌లోని ప్రజ్ఞాన్ రోవర్ పంపిన ఈ ప్రాంతానికి సంబంధించిన చిత్రాలు.. కాలక్రమేణా చంద్రుడు ఎలా పరిణామం చెందాడో వెల్లడిస్తాయి' అని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీలో ప్లానెటరీ సైన్సెస్ డివిజన్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్ విజయన్ తెలిపారు. సాధారణంగా ఒక గ్రహాన్ని, లేదా చంద్రుడి వంటి భారీ ఉపరితలాన్ని గ్రహశకలం ఢీకొట్టినప్పుడు బిలం ఏర్పడుతుంది. అలా ఏర్పడిందే ఈ పురాతన బిలమని, విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతానికి దగ్గరలోనే ఇది ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.